క్లుప్తంగా

రజకులకు ప్రత్యేక చెరువులు కేటాయించాలి



చిలకలపల్లి కట్లయ్య

ఉండి: ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గ్రామంలోను రజకులకు ప్రత్యేక చెరువులు కేటాయించాలని ఉమ్మడి జిల్లా రజకసంఘాధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 6వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి భీమవరం వారి ఆదేశానుసారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాచతీ అధికారులు రజకులకు చెరువులను కేటాయించాలని స్పష్టం చేశారు. రకరకాల పంచాయతీ చెరువులు ఉంటే దానిలో ఒకచెరువు ఇవ్వాలని, మంచినీటి చెరువు మాత్రమే ఉంటే దానిలో సగభాగం ఇవ్వాలని కోరారు.

వృద్ధులకు కళ్లజోళ్ల అందజేత



మహిళకు కళ్ళజోడు అందిస్తున్న రామరాజు, ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కాళ్ల ఎస్సై ఎస్. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత దాట్ల వెంకటరామరాజు ఆధ్వర్యంలో పేదలకు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన కంటివైద్యశిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన సుమారు 150 మంది పేదలకు సుమారు రూ. 90 వేల విలువైన కళ్లజోళ్లను రామరాజు తన సొంత ఖర్చుతో చేయించి వారికి అందించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావుతో పాటు పలువురు గ్రామస్తులు రామరాజుని అభినందించారు.

గ్రామీణ బస్సులను పునరుద్ధరించాలి

ఆకివీడు: భీమవరం డిపో నుంచి మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు గతంలో నడిచే బస్సులను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. భీమవరం నుంచి ఆకివీడు మీదుగా కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు గ్రామానికి ప్రతి రోజూ బస్సును నడిపేవారు. అదే విధంగా భీమవరం నుండి ఆకివీడు, అయిభీమవరం, చెరుకుమిల్లి మీదుగా మందపాడు బస్సు నడిచేది. ఆకివీడు మీదుగా దుంపగడప గ్రామానికి ఒక బస్సును నడిపేవారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం నుండి పెదకాపవరం మీదుగా చినకాపవరం, గుమ్ములూరు, తరటావ, ఆకివీడు వరకూ బస్సు నడుస్తుంది. రోజుకు రెండు ట్రిప్పులు నడుస్తున్న బస్సు రాత్రి ఆకివీడు బస్సు స్టాండ్‌లో నిలుపుదల చేసి, తెల్లవారుజామునే బయలుదేరుతుంది. ఆయా గ్రామాలకు బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు నిలిపివేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని, సమయానుకూలంగా బస్సులను నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మాలధారణ భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారి మాల ధారణ భక్తులచే ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. 400 మంది భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ పాల్గొన్నారు.మావుళ్లమ్మ అమ్మవారిని గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీక మాసం సందర్భంగా బీచ్‌కు వెళ్లే వారు కూడా అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

- 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరికి పరీక్షలు
- నెలాఖరు వరకు కొనసాగనున్న సర్వే



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

కాళ్ల: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ‘క్యాన్సర్ విజయం.. స్క్రీనింగ్ సాధ్యం’అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. గురువారం నుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సిబ్బందికి ప్రత్యేక శిక్షణనిచ్చిన అధికారులు సర్వేను నిరంతరం పర్యక్షిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల అధిక మరణాలకు కారణమవుతోంది. క్యాన్సర్ మహమ్మారిని ఎదర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితుల మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రధానం

ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారు. క్యాన్సర్ నివారణ, ముందస్తు రోగ నిర్ధారణకు మెరుగైన ఫలితాల కోసం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉపయోగపడతాయి. ప్రస్తుతం గ్రామాల్లో అయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సర్వే ఇలా

క్యాన్సర్ పరీక్షల కోసం 18 సంవత్సారాలు నిండిన మహిళల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యల తెలుసుకుని, ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా అప్‌లోడ్ చేశారు. వీటితో దంత పరీక్షలు సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముందుగా అవగాహన కల్పిస్తారు. నవంబర్ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. అదే విధంగా రోజులో ఐదు ఇళ్లు, వారంలో 5 రోజులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని కాళ్ల, ఆకివీడు, ఉండి, పాలకోడేరు,మండలాల్లో సుమారు లక్ష యాభై వేల మందికి పైగా ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

“ మహిళలకు ఉపయోగం



క్యాన్సర్ స్క్రీనింగ్‌తో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లతో బాధపడుతున్నారు. వారు ఈ పరీక్షలతో సత్ఫలితాలను పొందవచ్చు. నవంబర్ నెల నుంచి మరో ఆరు నెలల వరకు ఇంటింటికి తిరిగి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సరాబు సునీల్, – కాళ్ల పీహెచ్‌సీ వైద్యుడు

గ్రంథ పఠనం అందరి బాధ్యత

భీమవరం: గ్రంథ పఠనం అందరి బాధ్యత అని, విద్యార్థికి గ్రంథ పఠనం ద్వారా ఉజ్వల భవిష్యత్తు అని ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్‌లు భానుమణి, ఎం శ్యామల అన్నారు. చదువరుల సంఘం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక మంచి పుస్తకాన్ని చదివితే అవే నీ జీవితాన్ని మారుస్తాయని అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను దేవాలయాలుగా భావించాలన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

సమాజ హితమే సాహిత్యం

భీమవరం: సమాజ హితమే సాహిత్యమని, అలాంటి సాహిత్యం నిరంతర సమాజహితాన్ని కోరుతుందని సాహితీవేత్త అక్షరకిరీటి తెన్నేటి మాస్టారు అన్నారు. 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా భీమవరం ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరిగిన కవిసమ్మేళనం సందర్భంగా తెన్నేటి మాస్టారు మాట్లాడారు. సమాజంలోని సమస్యలకు తనదైన శైలిలో పరిష్కారాలను రచయితలు, కవులు తమ రచనల ద్వారా సమాజానికి అందివ్వాలన్నారు. ఈ కవి సమ్మేళనంలో కలిగొట్ల గోపాల శర్మ ఎంతో గొప్ప చరిత్రకు మను వారసులం మన ఆంధ్రజాతి అనాది సాంస్కృతిక వారసత్వాలకు పెన్నిధి అంటూ ఆలపించిన ఆంధ్రుల వైభవం అనే కవిత సభికులను ఆకుట్టుకుంది. కార్యక్రమంలో చివటం శ్రీనివాసరావు, పెంకి విజయకుమార్, దొంతాభక్తుని రామనాగేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీ నారాయణ, పులిదిండి సత్యం, కలిగొట్ల గోపాల శర్మ, కొత్తపల్లి మణిత్రినాధరాజు, యల్. వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరం ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల దృశ్యం



ఆకివీడు: మాదివాడ శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతన్న పుచ్చకాయల బ్రహ్మాజీ



ఉండి: వుయ్ లవ్ రీడింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

మెదడుకు మేత పుస్తకమే

ఆకివీడు: విద్యార్థులకు బాల్యం నుండి యవ్వనం వరకూ పుస్తక పఠనంతోనే మేధస్సు వృద్ధి చెందుతుందని ప్రముఖ లాయర్, రచయిత పుచ్చకాయల బ్రహ్మాజీ చెప్పారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా ఆదివారం కవి సమ్మేళనం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు పుస్తకాలు చదవడం తగ్గించేశారన్నారు. పుస్తకం నేస్తమన్నారు. పుస్తకం మన మెదడుకు మేత లాంటిదన్నారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం అధ్యక్షుడు దాసరి వెంటక సత్యనారాయణ, సభ్యులు కె.కిషోర్, బీ.దేవి, పి.శ్రీనివాసరావు, టీ.దిలీప్‌రాజ్, గ్రంథ పాలకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రంథాలయం వద్ద చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమకు ఇష్టమైన పుస్తకాలను ఆశక్తిగా చదివారు. అనంతరం గ్రంథాలయం వద్ద రన్నింగ్, స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో విజేతలైన వారికి ఈ నెల 20న బుధవారం వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి తెలిపారు.

ప్రకృతి ఆశ్రంలో కార్తీక దామోదర పూజ



ప్రకృతి ఆశ్రంలో కార్తీక దామోదర పూజలో పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే

భీమవరం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భీమవరం ప్రకృతి ఆశ్రమంలోని డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు గారి తోటలో హిందూ వనవిహార్ పేరిట నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి గోమాత పూజ, కార్తీక దామోదర పూజ, కడప జిల్లా బ్రహ్మంగారి మఠం నుంచి విచ్చేసిన విరజానంద స్వామిజీ అనుగ్రహ భాషణ, ఆర్ఎస్ఎస్ సహక్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ సందేశం, ఆటపాటలు, సంస్కృతి కార్యక్రమాలు, కళా బృందాల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వేలాదిమంది ఈ కార్యక్రమంలో వన భోజనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, కైకలూరు, భీమవరం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు తోపాటు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని కన్వీనర్ మంతెన రామచంద్రరాజు తదితరులు పర్యవేక్షించారు.

విత్తనాల పంట కోత షురూ



మాదివాడ ఆయకట్టులో విత్తనాల పంట కోత కోస్తున్న దృశ్యం

ఆకివీడు: ఖరీఫ్ పంట సాగు దశలోనే ఉంది. పలు చోట్ల పంట పొట్ట దశ, పూత, పాలు పోసుకునే దశలో ఉండగా, మరి కొన్ని చోట్ల ధాన్యం గింజ తయారీ దశలో ఉంది. వచ్చే దాళ్వా సాగుకు రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన విత్తనాల పంట కోతకు వచ్చింది. మండలంలో అక్కడక్కడా విత్తనాల కోసం సాగు చేసిన ఎంటీయూ 1121 రకం వంగడం కోతలు కోస్తున్నారు. ఖరీఫ్‌లో రైతులు అధిక శాతం మంది ఎంటీయూ 1318 రకం విత్తనాన్ని సాగు చేశారు. భారీ వర్షాలు, వరదలకు మండలంలో 80 శాతం పంట పాడైపోయింది. మిగిలి ఉన్న వరి చేలల్లో పంట వివిధ దశల్లో ఉంది. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో 58 ఎకరాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో దాళ్వా నాట్లు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

పంచారామ క్షేత్రంలో కార్తీక అన్న సమారాధన



పంచారామ క్షేత్రంలో అన్న సమారాధన చేస్తున్న దృశ్యం

భీమవరం : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామ క్షేత్రాల్లో ఒకటైన భీమవరం, గునుపూడిలో ఉమా సోమేశ్వరజనార్దన స్వామి ఆలయంలో ఆదివారం భీమవరం ప్యాడి అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ వారి సౌజన్యంతో కార్తీక అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చవాకుల నరసింహారావు, కార్యదర్శి పరుచూరి చిన నాగేశ్వరరావులు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత ఎనిమిది సంవత్సరాలుగా మా అసోసియేషన్, సభ్యుల సహకార సౌజన్యంతో అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాలు స్వీకరించి తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొత్త శ్రీనివాస్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చెక్క సుబ్బారావు, కోశాధికారి బాధరాల పుల్లేశ్వరరావు, నాయకులు పోలిశెట్టి సత్యనారాయణ దాసు ,రావూరి వెంకటేశ్వరరావు, సభ్యులు ఏక్కల శ్రీనివాసులు, చెక్కా వెంకటేశ్వరరావు, చవ్వా సత్య కృష్ణ ,జొన్నలగడ్డ వెంకటకృష్ణ,రాట్నాల సత్యనారాయణ, ఇన్నమూరి సురేష్, సుంకు రమేష్, సంఘ సేవకులు అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈ.వో.రామకృష్ణంరాజు అసోసియేషన్ నాయకులను సత్కరించారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అప్రోచ్‌లకు నిధులు

రూ.36 కోట్లు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో వేగవంతగా అభివృద్ధి చెందుతున్న పట్టణం భీమవరం. తీరప్రాంత గ్రామాలు, పట్టణ ప్రజలకు కల సాకారం చేయడానికి 2004 నుంచి 2009 వరకు మొదటిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన గ్రంధి శ్రీనివాస్ నాడు తీర ప్రాంత ప్రజల సౌకర్యార్థం డెల్టా ఆధునికీకరణలో భాగంగా నాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో యనమదుర్రు డ్రెయిన్‌పై భీమవరం చేపల మార్కెట్, గొల్లవానితిప్ప, తోకతిప్ప ప్రాంతాల్లో మూడు వంతెనలకు నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్లు వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. తర్వాత ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్ లేకపోవడంతో వంతెనల అప్రోచ్‌ల నిర్మాణం ఆగిపోయింది. దాంతో మూడు వంతెనలు కూడా నిరుపయోగంగా మారాయి.

రూ.36 కోట్ల నిధులు తీసుకువచ్చిన గ్రంధి శ్రీనివాస్

2019లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన గ్రంధి శ్రీనివాస్ వంతెనల అప్రోచ్‌ల నిర్మాణానికి చొరవ తీసుకున్నారు. సమస్యను మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తొలుత ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.15.30 కోట్లు మంజూరు చేయించారు. డిజైన్లను పూర్తి చేసి శాశ్వత ప్రాతిపదికన అప్రోచ్‌ల నిర్మాణానికి సిద్ధమవుతున్న తరుణంలో డిజైన్లను మార్పు చేయాల్సి వచ్చింది. కొత్త డిజైన్లతో అప్రోచ్‌లను నిర్మించాలని మరోసారి జగన్ మోహన్‌రెడ్డికి వివరించి రూ.36 కోట్లు నిధులను మంజూరు చేయించారు. అలాగే డిజైన్లకు సంబంధించి గ్రంధి శ్రీనివాస్ తన సొంత ఖర్చులు కూడా చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి పంపించిన డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేసి అప్రోచ్ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. టెండర్లు ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు నిలిపోయాయి. కాని నిధులు మాత్రమే అలాగే ఉన్నాయి.

నిధులు మంజూరు గురించి చెప్పలేకపోయిన ఎమ్మెల్యే అంజిబాబు

గత ప్రభుత్వంలో అప్రోచ్‌ల నిర్మాణం జరగలేదని అసెంబ్లీలో ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడారు. కాని గత ప్రభుత్వంలో రూ. 36 కోట్లు నిధులు మంజూరు చేసిందని టెండర్లు వరకు వెళ్లిందనే విషయాన్ని ప్రస్తావించలేకపోయారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు రూ.36 కోట్లు అప్రోచ్ నిర్మాణం కోసం సిద్ధం ఉన్నాయని వాటిని ఈ ప్రభుత్వం బడ్జెట్లో పెట్టి టెండర్లు ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని సూచించలేదు. కేవలం గత ప్రభుత్వంలో అప్రోచ్‌ల నిర్మాణం జరగలేదని సింపుల్‌గా చెప్పేశారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్రోచ్‌లకు నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

పాలకొల్లులో సాదాసీదాగా మండలపరిషత్ సమావేశం

పాలకొల్లు అర్బన్: ఎందుకొచ్చిన పదవులు సంతకాలు పెట్టడానికి తప్ప తమ గ్రామానికి ఒక్క రూపాయి కూడా పని చేయించలేకపోయానంటూ గవరపేట టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు దొడ్డి ధనలక్ష్మి అధికారుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేసింది. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ చిట్టూరి కన కల్కక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అభివృద్ధి పనులపై చర్చ కొనసాగలేదు. సమావేశానికి సర్పంచ్‌లు, అధికారులు గైర్హాజరు కావడంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. మండల పరిషత్ ప్రతిపక్ష నేత శాగ సత్యనారాయణ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు చాలా మంది కొత్తగా వచ్చారని, వారంతా ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పడవల సునీల్ బాబు, కోఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు, ఎంపీటీసీలు యాండ్ర లక్ష్మీకుమారి, సర్పంచ్‌లు రాపాక నగేష్ కరుణాకర్, దిడ్ల మణివజ్రం, గంటా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ

నరసాపురం: ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత లక్ష్యాలు చేరుకోగలుగుతారని రాయల్స్ క్లబ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాయల్స్‌క్లబ్ ద్వారా 200 మంది విద్యార్థులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయాన్ని స్కాలర్‌షిప్స్ రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చినిమిల్లి మాట్లాడుతూ రాయల్స్‌క్లబ్ ద్వారా ఆర్థిక ప్రోత్సాహం కరువైన కాపు విద్యార్థులను ఆదుకుంటున్నామని చెప్పారు. మరో ముఖ్య అతిథి తులసీసీడ్స్(గుంటూరు) చైర్మన్ తులసీరామచంద్రప్రభు మాట్లాడుతూ రాయల్స్‌క్లబ్ చేపట్టిన కార్యక్రమాన్ని కొనియాడారు. అనంతరం రాయల్స్‌క్లబ్ మహిళా విభాగం నరసాపురంశాఖ కార్యవర్గాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వలవల సావిత్రి, కంబాల స్వర్ణ, ఉపాధ్యక్షురాలిగా పోలిశెట్టి నళిని ప్రమాణస్వీకారం చేశారు. వర్ధమాన హీరో ఉలిశెట్టి శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి, అందే రంగారావు, పోలిశెట్టి రఘురామ్, సలాది రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో చెన్నమల్లేశ్వరుడు

ఉండి: స్థానిక రాజులపేటలో ఉన్న పార్వతీస మేత చెన్నమల్లేశ్వరస్వామి వారికి కార్తీక మాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యకార్యక్రమాలను నిర్వహించారు. చెన్నమల్లేశ్వరుడికి దానిమ్మ,సీతాఫలాలతో అలంకణ చేశారు.అనంతరం దానిమ్మ గింజలతో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం అర్చకులు సన్నిధిరాజు కృష్ణ, సన్నిధిరాజు చలపతిరావు, ఫణిశర్మ తదితరులు పూజలు నిర్వహించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

భీమవరం అర్బన్: మండలంలోని భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నరసింహపురం గ్రామంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం ఎస్ఐ వీర్రాజు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,800లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ బంటుమిల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేని ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు తొలగిస్తాం

నరసాపురం: పట్టణంలో అనుమతులు లేకుండా కట్టిన ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరికివారు ఇలాంటి బోర్డులు వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అలాగే అనుమతులు తీసుకుని కట్టిన బోర్డులు కూడా నిర్ణీతకాల వ్యవధిలో తొలగించాలని చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీవో దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.